
# రాకాసి యుద్ధ విమానం!

**అమెరికా బీ-2 బాంబర్ ప్రత్యేకతలెన్నో** | **ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనది**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): ఇరాన్‌లోని ఫోర్డో అణు కేంద్రాన్ని ధ్వంసం చేయడానికి అమెరికా బీ-2 స్పిరిట్ బాంబర్ యుద్ధ విమానాన్ని వినియోగించింది. నిర్ణీత లక్ష్యాలను తుత్తునియలు చేయడంలో 100 శాతం సక్సెస్ రేటు కలిగిన ఈ యుద్ధ విమానం ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనది కూడా. యూఎస్ రాకాసి విహంగంగా పిలిచే ఈ యుద్ధ విమానంలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి.



- పేరు: బీ-2 స్పిరిట్ బాంబర్
- ఆకారం: గబ్బిలం నమూనా
- రెక్కల పొడవు: 172 అడుగులు
- బరువు: 72,575 కిలోలు
- పొడవు: 69 అడుగులు
- ఇంజిన్లు: 4
- పైలట్లు: ఇద్దరు
- గరిష్ఠ వేగం: గంటకు 1,010 కిలోమీటర్లు
- గరిష్ఠ ఎత్తు: 15,200 మీటర్లు
- ఏకబిగిన ప్రయాణించగలిగే దూరం: 11 వేల కిలోమీటర్లు
- రీఫ్యూయలింగ్‌తో ప్రయాణించేది: 18,500 కిలోమీటర్లు

మోసుకెళ్లగలిగే బాంబులు: 18 వేల కిలోలు

సక్సెస్ రేటు: 100 శాతం | ఖరీదు: రూ. 18,182 కోట్లు | తయారీ కంపెనీ: నార్త్‌రోప్ గ్రమ్మన్

## ప్రత్యేకతలకు కేరాఫ్..బీ-2


- శత్రు దేశాల రాడార్లకు చిక్కకుండా.. రాడార్ తరంగాలను చెల్లాచెదురు చేసే అత్యాధునిక స్టెల్త్ టెక్నాలజీ ఈ బీ-2 బాంబర్ సొంతం.
- శత్రుదేశాల గగనతల రక్షణ వ్యవస్థలను ఏమార్చేందుకు ఈ విమానాన్ని వినూత్న డిజైన్‌తో రూపొందించారు.
- రాడార్ సిగ్నల్లకు దొరక్కుండా విమానం బాడీకి రాడార్ అబ్సార్బింగ్ మెటీరియల్ (ఆర్ఏఎం) అనే ఓ ప్రత్యేకమైన పూతను అద్దారు.
- వాతావరణంలో ఉష్ణోగ్రతలు ఏమాత్రం మారినా ఈ పూత పనిచేయదు. అందుకే, ఈ జెట్లను ఎయిర్ కండిషనింగ్ హ్యాంగర్ల నడుమ భద్రపరుస్తారు.
- ఆర్ఏఎం పూత కారణంగా గగనతలంలోకి వచ్చేవరకూ ఈ విమానాన్ని శత్రువులు అంత సులభంగా పసిగట్టలేరు. విమానం నుంచి వచ్చే శబ్దాలు కూడా తక్కువ మోతాదులోనే ఉంటాయి.
- పరారుణ సెన్సర్లు గుర్తించకుండా విమానం నుంచి వచ్చే వేడిని తగ్గించడానికి ఇంజిన్లను బాడీ లోపలే అమర్చారు.
- ఒక్కసారి ఇంధనం నింపితే ఏకంగా 11 వేల కిలోమీటర్ల మేర ప్రయాణించగలదు. అందుకే కాక్‌పిట్ వెనుక భాగంలో పైలట్లు విశ్రాంతి తీసుకోవడానికి బెడ్, చిన్న కిచెన్, అరలు, మైక్రోఓవెన్, టాయిలెట్లు కూడా ఉన్నాయి.






### బీ-2ను తలదన్నేలా బీ-21

*ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన యుద్ధ విమానాలుగా పేరుగాంచిన బీ-2 స్థానంలో మరింత శక్తివంతమైన అడ్వాన్స్‌డ్ బీ-21 రైడర్లను తీసుకురావాలని అమెరికా భావిస్తున్నది. బీ-2 సాంకేతికత 1990నాటిది కావడం, రక్షణ రంగంలో చైనా, రష్యా కొత్త సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి ప్రయత్నిస్తుండటంతో అమెరికా ఈ యోచన చేస్తున్నది. బీ-2తో పోలిస్తే ఎన్నో విషయాల్లో బీ-21 మెరుగ్గా ఉండనున్నట్టు రక్షణ రంగ నిపుణులు చెప్తున్నారు. గడిచిన మూడు దశాబ్దాల్లో రక్షణ రంగంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా బీ-21ను తయారు చేయనున్నారు. సంప్రదాయ బాంబులతో పాటు అణ్వాయుధాలు, అణుబాంబులను మోసుకెళ్లే సామర్థ్యం దీనిలో ఉండనున్నట్టు భావిస్తున్నారు. అడ్వాన్స్‌డ్ స్టెల్త్ టెక్నాలజీతో పాటు నిర్వహణ భారం కూడా తక్కువగా ఉండేలా దీన్ని రూపొందించనున్నారు. పైలట్ల అవసరం లేకుండా డిజిటల్ సిస్టమ్‌తో నడిచేలా రూపొందించనున్న ఈ బీ-21 నుంచి డ్రోన్లను కూడా ప్రయోగించవచ్చు. పరిధి, వేగం, సామర్థ్యం, సాంకేతికత ఇలా అన్ని విషయాల్లో బీ-2తో పోలిస్తే బీ-21.. కనీసం 30 ఏండ్ల అడ్వాన్స్‌డ్‌గా ఉండనున్నట్టు చెప్తున్నారు. తొలిదశలో కనీసం వంద బీ-21 రైడర్లను సిద్ధం చేసుకోవడానికి అమెరికా ప్రణాళికలు రచిస్తున్నట్టు సమాచారం.*



# అమెరికాపై ఇరాన్ ప్రతీకార దాడి

- ఖతార్, ఇరాక్‌లోని స్థావరాలపై క్షిపణుల వర్షం
- అగ్రరాజ్యంపై ఆపరేషన్ 'బెషారత్ ఫతాహ్'

టెహ్రాన్, జూన్ 23: తమ అణు కేంద్రాల మీద అమెరికా జరిపిన వైమానిక దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ సోమవారం ప్రతీకార దాడులకు దిగింది. ఇరాన్, ఇరాక్‌లోని అమెరికా వైమానిక స్థావరాలపై క్షిపణుల వర్షం కురిపించింది. అగ్రరాజ్యం దురాక్రమణకు వ్యతిరేకంగా ఆపరేషన్ 'బెషారత్ ఫతాహ్'ను ప్రారంభించినట్టు ప్రకటించింది. ఖతార్‌లోని అమెరికా వైమానిక స్థావరం అల్ ఉదీద్‌పై క్షిపణులతో దాడిచేసినట్టు ఇరాన్ టీవీ వెల్లడించింది. అల్ ఉదీద్ పశ్చిమాసియాలోనే అమెరికాకు ఉన్న అతి పెద్ద సైనిక స్థావరం. ఖతార్ రాజధాని దోహాకు వెలుపల ఉన్న ఈ స్థావరంలో సుమారు 10వేల మంది అమెరికన్ సైనికులు ఉన్నట్టు అంచనా. పశ్చిమాసియా ప్రాంతంలో తన సైనిక వ్యవహారాలకు ఈ కేంద్రం అమెరికాకు ఎంతో కీలకమైనది. దోహ సమీపంలో భారీ పేలుళ్ల శబ్దాలు వెలువడినట్టు ప్రత్యక్ష సాక్షులను ఉటంకిస్తూ రాయిటర్స్, ఏఎఫ్‌పీ వార్తా సంస్థలు పేర్కొన్నాయి. దీంతో ఖతార్ తన గగనతలాన్ని మూసివేసింది. సురక్షిత స్థానాలకు వెళ్లిపోవాలని అమెరికా, బ్రిటన్‌లు ఖతార్‌లోని తమ పౌరులకు సూచించాయి. మరోవైపు ఇరాక్‌లోని అయిన్ అల్ అసద్ బేస్‌పైనా ఇరాన్ రాకెట్లు ప్రయోగించింది. అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ప్రతిష్ఠంభన నేపథ్యంలో ఈ దాడులు ప్రమాదకరమైన మలుపుగా నిపుణులు భయాందోళనలు వ్యక్తంచేస్తున్నారు. ఈ యుద్ధం పశ్చిమాసియా అంతటా విస్తరించే అవకాశం ఉన్నదని ఆందోళన చెందుతున్నారు. ఆదివారం తెల్లవారు జామున తమ అణు కేంద్రాలపై అమెరికా దాడి చేసిన వెంటనే దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ ప్రకటించింది. అందులో భాగంగానే అమెరికా సైనిక స్థావరంపై క్షిపణి దాడికి పాల్పడింది. అయితే ఇది మొదటి దాడి మాత్రమేనని ఇరాన్ సైనిక వర్గాలు పేర్కొన్నాయి. తమ అణుకేంద్రాలపై దాడికి అమెరికా ఎన్ని బాంబులను ఉపయోగించిందో తాము కూడా తమ ప్రతీకార దాడిలో అదే సంఖ్యలో బాంబులను ఉపయోగించామని ఇరాన్ జాతీయ భద్రతా మండలి తెలిపింది. ఇదిలా ఉండగా, ఇరాన్ ప్రతీకార చర్యల నేపథ్యంలో పశ్చిమాసియాలో పరిస్థితిని పర్యవేక్షించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెంటనే సిట్యుయేషన్ రూమ్‌కు చేరుకున్నట్టు వైట్ హౌస్ వర్గాలు వెల్లడించాయి. ఆయనతో పాటు రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, సైనిక దళాల ముఖ్యుల చైర్మన్ జనరల్ డాన్ కెయిన్ కూడా ఉన్నట్టు తెలిపాయి. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ మాస్కోలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను కలుసుకున్న అనంతరం ఈ దాడులు జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది.



దోహాలోని అమెరికా ఎయిర్‌బేస్‌పై విరుచుకుపడతున్న క్షిపణులు

**ప్రాణ నష్టం జరగలేదు: ఖతార్**

తమ భూభాగంపై ఇరాన్ జరిపిన దాడిని ఖతార్ ఖండించింది. ఈ దాడి తమ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది. ఇరాన్ జరిపిన దాడుల్లో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపింది. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను విజయవంతంగా తిప్పి కొట్టామని, తమ గగనతల రక్షణ వ్యవస్థ పటిష్ఠంగా ఉన్నదని ఖతార్ విదేశాంగ శాఖ ప్రతినిధి మాజెద్ అల్ అన్సారీ పేర్కొన్నారు. అమెరికా, ఇరాన్ మధ్య మళ్లీ చర్చలు ప్రారంభమయ్యే విధంగా తాము దౌత్యపరంగా తీవ్ర ప్రయత్నాలు చేయనున్నట్టు వెల్లడించారు. అయితే ఈ దాడులపై ఇరాన్ ముందుగానే ఖతార్‌ను హెచ్చరించినట్టు న్యూయార్క్ టైమ్స్ పత్రిక తెలిపింది.

**సిరియాలో అమెరికా సైనిక స్థావరంపై దాడి**

సిరియాలోని హసకా ప్రావిన్సులో ఉన్న అమెరికా సైనిక స్థావరంపై కూడా దాడి జరిగినట్టు మెహర్ న్యూస్ సోమవారం వెల్లడించింది. ఇరాన్ అనుకూల గ్రూపులు ఈ దాడికి పాల్పడి ఉండవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. దీనిపై అమెరికా నుంచి ఎటువంటి ధ్రువీకరణ రాలేదు. అలాగే ఇరాన్ కూడా ఈ దాడికి సంబంధించి ఎటువంటి ప్రకటన చేయలేదు. ఈ దాడి నేపథ్యంలో ఆ ప్రాంతంలో భద్రతను అమెరికా కట్టుదిట్టం చేసింది. అమెరికా భద్రతా దళాలు కూడా అప్రమత్తమయ్యాయి. ఇరాన్‌లోని మూడు అణు కేంద్రాలపై అమెరికా దాడి చేసిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

**భారత పౌరులకు అడ్వైజరీ**

అమెరికా బేస్‌లపై ఇరాన్ దాడుల నేపథ్యంలో ఖతార్‌లోని భారత పౌరులకు ఇండియన్ ఎంబసీ అడ్వైజరీ జారీచేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండగని, ఇండ్లకే పరిమితం కావాలని సూచించింది. స్థానిక వార్తలను ఫాలో అవ్వాలని, ఖతార్ అధికారులు ఇచ్చే సూచనలను పాటించాలని కోరింది. తమ సోషల్ మీడియా ఖాతాల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందజేస్తామని పేర్కొన్నది.

**గగనతలాన్ని మూసేసిన గల్ఫ్ దేశాలు**

ఖతార్‌లోని అమెరికా బేస్‌పై ఇరాన్ దాడి నేపథ్యంలో గల్ఫ్ దేశాలు తమ గగనతలాల్ని మూసివేశాయి. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు తమ గగనతలాల్ని మూసివేస్తున్నట్టు ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, కువైట్, ఇరాక్ ప్రకటించాయి. కాగా, ఇరాన్ దాడుల నేపథ్యంలో ఇండియా-ఖతార్ వెళ్లే రెండు విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఇండిగో, ఎయిరిండియా ఈ సర్వీసులను నడుపుతున్నాయి.

# ఇరాన్‌పై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

- 6 ఆర్మీ ఎయిర్‌పోర్టులపై దాడులు
- 15 ఫైటర్ జెట్స్, రన్‌వేలు ధ్వంసం
- ఎవిన్ జైలుపైనా బాంబుల వర్షం
- ఫోర్డో అణు కేంద్రంపై మళ్లీ దాడి
- ప్రతిగా ఇజ్రాయెల్ విద్యుత్తు కేంద్రంపై ఇరాన్ దాడి



ఇరాన్‌లోని ఎవిన్ కారాగారంపై ఇజ్రాయెల్ దాడితో అలుముకున్న పొగ

న్యూఢిల్లీ: ఇరాన్‌లోని ఆరు మిలిటరీ విమానాశ్రయాలపై దాడి చేసి 15 విమానాలు, రన్‌వేలను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం సోమవారం వెల్లడించింది. ఇరాన్‌కు చెందిన పశ్చిమ, తూర్పు, మధ్య ప్రాంతాలలోని విమానాశ్రయాలపై తాము దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళాలు(ఐడీఎఫ్) తెలిపాయి. తమ డ్రోన్ దాడులు ఎఫ్-15, ఎఫ్-5 ఫైటర్ జెట్లు, ఒక రీఫ్యూయెలింగ్ విమానం, ఒక హెచ్-1 కోబ్రా అటాక్ హెలికాప్టర్‌ని ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ తెలిపింది. అయితే ఇరాన్ ఈ దాడులను ధ్రువీకరించలేదు.

**ఎవిన్ జైలుపై వైమానిక దాడి**

ఇరాన్‌లోని అత్యంత క్రూరమైన కారాగారంగా పేరుమోసిన ఎవిన్ జైలుపై సోమవారం ఇజ్రాయెల్ వైమానిక దాడి జరిపింది. ఎవిన్ జైలుపై జరిగిన దాడికి ఇజ్రాయెల్ నేరుగా బాధ్యత తీసుకోనప్పటికీ ఇరాన్‌లోని సైనిక లక్ష్యాలపై వరుస దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ సైన్యం ధ్రువీకరించింది. సోమవారం మధ్యాహ్నం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుళ్లు వినిపించినట్లు ఏఎఫ్‌పీ జర్నలిస్టులు వెల్లడించారు. ఇరాన్ సుప్రీం నాయకుడు ఖమేనీకి నేరుగా జవాబుదారీగా వ్యవహరించే ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డు కోర్(ఐఆర్‌జీసీ) ఎవిన్ కారాగారాన్ని నిర్వహిస్తున్నాయి. హక్కుల ఉల్లంఘనకు మారుపేరుగా పరిగణించే ఈ జైలుపై అమెరికా, యూరోపియన్ ఏనాడో ఆంక్షలు విధించాయి.

**ఫోర్డోపై మళ్లీ దాడులు**

ఇరాన్‌లో ముఖ్యమైన అణుశుద్ధి కేంద్రం ఫోర్డో సహా మూడు అణు కేంద్రాలపై ఆదివారం అమెరికా దాడులు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఫోర్డోపై ఇజ్రాయెల్ మరోసారి దాడులు జరిపినట్టు ఇరాన్ తెలిపింది. అయితే ఎంతమేరకు నష్టం వాటిల్లిందో వెల్లడించలేదు.

**ఇజ్రాయెల్ విద్యుత్తు కేంద్రంపై దాడి**

తమపై ఇజ్రాయెల్ జరిపిన దాడులకు ప్రతీకారంగా ఇరాన్ ఆపరేషన్ ట్రూ ప్రామిస్ 3 పేరిట తమ క్షిపణి, డ్రోన్ దాడుల ఉధృతిని తీవ్రతరం చేసింది. హైఫా, టెల్ అవీవ్‌తోసహ అనేక ఇజ్రాయెలీ నగరాలపై దాడులు నిర్వహించింది. దక్షిణ ఇజ్రాయెల్‌లోని విద్యుత్తు కేంద్రంపై సోమవారం ఇరాన్ క్షిపణి జరిపిన దాడి కారణంగా విద్యుత్తు సరఫరా తాత్కాలికంగా నిలిచిపోయి దాదాపు 8 వేల మంది ఇజ్రాయెలీలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇజ్రాయెల్ వ్యాప్తంగా సోమవారం ఇరాన్ దాడులు కొనసాగాయి. జెరూసలెంలో భారీ పేలుళ్లు సంభవించినట్లు వార్తలు వచ్చాయి.

# ఫోర్డో కోసం చివరి వరకూ!

- మట్టి దిబ్బలతో బలోపేతం
- దాడికి 2 రోజుల ముందు కూడా మట్టి తరలింపు
- ఫోర్డో వద్ద పెద్ద సంఖ్యలో ట్రక్కులు, జేసీబీలు



న్యూఢిల్లీ: ఇరాన్‌లోని భూగర్భ ఫోర్డోఅణు కేంద్రంపై అమెరికాకు చెందిన 13,607 కిలోల బరువైన భారీ బంకర్ బస్టర్ బాంబులతో బీ-2 స్పిరిట్ స్టెల్త్ బాంబర్లు దాడి చేయడానికి రెండు రోజుల ముందు కూడా అణు కేంద్రాన్ని పటిష్టం చేసేందుకు ఇరాన్ తీవ్రంగా శ్రమించినట్లు తెలుస్తున్నది. అమెరికా దాడులు జరగడానికి రెండు రోజుల ముందు ఫోర్డోకు చెందిన రెండు ప్రవేశాల ఎదుట మట్టి దిబ్బలు పోసినట్లు జూన్ 19న తీసిన ఉపగ్రహ చిత్రాలు వెల్లడిస్తున్నాయి. ప్రవేశాల సమీపంలో 16 మట్టిని తరలించిన ట్రక్కులు కనిపించగా, మట్టిని తవ్విపోసే యంత్రాలు కూడా ఆ చిత్రాలలో కనిపించినట్లు సీఎన్ఎన్ తెలిపింది. ఫోర్డో అణు కేంద్రానికి వెళ్లే మార్గం మట్టితో కప్పుకుపోయినట్లు జూన్ 20న తీసిన ఉపగ్రహ చిత్రంలో కనిపించింది. మట్టి లోడుతో ఉన్న ట్రక్కులు ఫోర్డో ప్రవేశాల వరకు వెళ్లగా సమీపంలోనే మట్టిని తవ్వుతున్న యంత్రాలు ఉపగ్రహ చిత్రాలలో కనిపించాయి. పర్వతం పక్కన 80 నుంచి 90 మీటర్ల లోతున భూగర్భంలో నిర్మించిన ఫోర్డో అణు కేంద్రాన్ని బాంబర్ల దాడి నుంచి తట్టుకునేందుకు వీలుగా మరింత బలోపేతం చేయడానికి ఇరాన్ ప్రయత్నించినట్లు ఈ ఉపగ్రహ చిత్రాలు బయటపెడుతున్నాయి. బాంబర్ల దాడి తర్వాత తీసిన ఉపగ్రహ చిత్రాలు అణు కేంద్రం పైభాగంలో మంటలు ఏర్పడినట్లు సూచిస్తున్న రెండు చిత్రాలు బయటకు వచ్చాయి.

**ముందే యురేనియం తరలింపు!**

అమెరికా సైనిక దాడులకు ఇరాన్ అణు కేంద్రాల కట్టడాలను దెబ్బతీసి ఉండవచ్చునని, కాని దాడులలో చాలా జాప్యం జరిగిందని సైనిక విశ్లేషకుడు టామ్ కూపర్ ఇండియా టుడేకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డారు. పర్వతం అడుగున భూగర్భంలో నిర్మించిన ఫోర్డో అణు కేంద్రం నుంచి అమెరికా దాడికి ముందే వేరే ప్రదేశానికి యురేనియం తరలింపు జరిగిపోయిందని ఆయన చెప్పారు. ఫోర్డోపై వేసిన బాంబులు 960 మీటర్ల ఎత్తయిన పర్వతం పక్కన పడి కొంత విధ్వంసం సృష్టించి ఉండవచ్చని, కాని భూగర్భంలో చాలా లోతున ఉన్న అణు కేంద్రాన్ని ధ్వంసం చేసే అవకాశాలు చాలా తక్కువని ఆయన తెలిపారు. ఏదేమైనా దాడి జరగడానికి రెండు రోజుల ముందే అణు కేంద్రంలోని విలువైన సామగ్రి ముఖ్యంగా యురేనియం తరలింపు జరిగిపోయిందని, వేలాది టన్నుల మట్టిని ఫోర్డో ప్రవేశాల వద్ద పోయడం వల్ల భూగర్భంలోని అణు కేంద్రానికి నష్టం జరిగే అవకాశాలు తక్కువని కూపర్ చెప్పారు. నతాంజ్, ఇస్ఫాహన్ అణు కేంద్రాలపైనా అమెరికా బాంబుల వర్షం కురిపించింది.

**గుంతలు కనపడుతున్నాయి**

ఫోర్డో అణు కేంద్రంపై గుంతలు కనపడుతున్నాయని, అయితే ప్రస్తుతం ఆ ప్రదేశం వద్దకు వెళ్లే పరిస్థితి లేదని ఐరాసకు చెందిన అంతర్జాతీయ అణు ఇంధన ఏజెన్సీ(ఐఏఈఏ) డైరెక్టర్ జనరల్ రఫేల్ మరియానో గ్రోసీ తెలిపారు.


## మా నీళ్లు మాకివ్వకపోతే భారత్‌తో యుద్ధం

**పాక్ మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో హెచ్చరిక**

ఇస్లామాబాద్: సింధూ జలాల ఒప్పందం కింద తమకు న్యాయబద్ధంగా రావలసిన వాటాను ఇవ్వని పక్షంలో భారత్‌పై తమ దేశం యుద్ధానికి వెళుతుందని పాకిస్థాన్ మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ సోమవారం హెచ్చరించారు. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి అనంతరం 1960 నాటి సింధూ జలాల ఒప్పందాన్ని భారత ప్రభుత్వం నిలిపివేసింది. ఈ చారిత్రాత్మక ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తి లేదని భారత హోం మంత్రి అమిత్ షా గత వారం ప్రకటించారు. అంతర్జాతీయ ఒప్పందాలను అమిత్ షా గౌరవించడం లేదని పాక్ విదేశాంగ శాఖ విమర్శించిన రెండు రోజులకే బిలావల్ భుట్టో ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. 'భారత్‌కు రెండు ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. న్యాయబద్ధంగా మా వాటాను మాకు పంచడం లేదా ఆరు నదుల నుంచి మా వాటాను మేమే తీసుకోవడం' అని బిలావల్ వ్యాఖ్యానించారు. సింధూ బేసిన్‌లోని ఆరు నదులను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సింధూ జలాల ఒప్పందం అమలులోనే ఉందని, సస్పెన్షన్‌లో ఉంచడం సాధ్యం కాదని చెప్పారు.

# ఇజ్రాయెల్ 'రష్యన్' దేశం

**అందుకే తటస్థంగా ఉన్నాం ▪ ఇరాన్‌కు మద్దతుపై పుతిన్**



మాస్కో, జూన్ 23: ఎన్నో దశాబ్దాలుగా ఇరాన్‌కు మిత్ర దేశంగా ఉన్న రష్యా కీలకమైన ప్రస్తుత దశలో తటస్థ వైఖరిని అవలంబిస్తున్నది. ఇరాన్‌పై అమెరికా దాడి విషయంలో ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయిస్తారని వార్తలు వెలువడినప్పుడు.. రష్యా స్పందిస్తూ.. ఇరాన్‌పై సైనిక చర్యకు పాల్పడరాదని వాషింగ్టన్‌ను హెచ్చరించింది. అమెరికా చర్య అత్యంత ప్రమాదకరంగా పరిణమించవచ్చని, అనూహ్యమైన ప్రతికూల పరిణామాలకు దారితీయవచ్చని రష్యా విదేశాంగ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా హెచ్చరించారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమైంది. రెండు అగ్రరాజ్యాలు తలపడితే పరిణామాలు భీకరంగా ఉంటాయని పలువురు అభిప్రాయపడ్డారు. దాడి విషయంలో రెండు వారాల్లో నిర్ణయించుకుంటామన్న ట్రంప్ రెండు రోజుల్లోనే ఇరాన్ అణు కేంద్రాలపై భీకర దాడులకు దిగారు. కానీ రష్యా నుంచి ఇరాన్‌కు అనుకూలంగా ఎటువంటి స్పందన కానరాలేదు. పైగా తాము ఈ పోరులో తటస్థంగా ఉంటున్నామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించడం ఆశ్చర్యానికి గురిచేసింది. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగిన అంతర్జాతీయ ఆర్థిక సదస్సులో పుతిన్ మాట్లాడుతూ.. మాజీ సోవియట్ యూనియన్, ప్రస్తుత రష్యన్ ఫెడరేషన్‌కు చెందిన దాదాపు 20 లక్షల మంది ప్రస్తుతం ఇజ్రాయెల్‌లో నివసిస్తున్నారని చెప్పారు. ఇప్పుడు ఇజ్రాయెల్ దాదాపు రష్యన్ భాష మాట్లాడే దేశంగా మారిపోయిందని అన్నారు. వర్తమాన చరిత్రలో ఈ అంశాన్ని తాము పరిగణనలోకి తీసుకుంటున్నామని వివరించారు.




ఆదివారం వైట్‌హౌస్ వెలుపల నిరసన ప్రదర్శన చేపట్టిన ఇరాన్ మద్దతుదారులు

# హ్యాండ్సాఫ్ ఇరాన్!

**ఇరాన్‌పై దాడులకు వ్యతిరేకంగా అమెరికాలో నిరసనలు**

*వాషింగ్టన్, జూన్ 23: ఇరాన్ అణు కేంద్రాలను ధ్వంసం చేసేందుకు అమెరికా 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్' చేపట్టడాన్ని అమెరికన్లు వ్యతిరేకిస్తున్నారు. సోమవారం న్యూయార్క్, బోస్టన్, వాషింగ్టన్ డీసీ సహా అమెరికాలోని ప్రధాన నగరాల్లో పెద్ద ఎత్తున యుద్ధ వ్యతిరేక నిరసనలు వెల్లువెత్తాయి. ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఇరాన్‌పై అమెరికా యుద్ధానికి దిగవద్దని, 'హ్యాండ్సాఫ్ ఇరాన్' అంటూ నిరసనకారులు నినాదాలు చేశారు. బోస్టన్, షికాగో, వైట్‌హౌజ్ ముందు, న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్ వద్ద ఆందోళనకారులు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. ఇజ్రాయెల్-ఇరాన్ సంక్షోభంలో కలుగజేసుకోవద్దని డొనాల్డ్ ట్రంప్ సర్కార్‌ను నిరసనకారులు డిమాండ్ చేశారు. ఇరాన్‌తో వివాదానికి, గాజాపై సైనిక చర్యకు ఇజ్రాయెల్ కారణమని, అమెరికా వెనక్కి తగ్గాలని నిరసనకారులు ట్రంప్ సర్కార్‌ను కోరారు.*

# ఇజ్రాయెల్ పెద్ద నేరం చేసింది.. శిక్షిస్తున్నాం

**అమెరికా దాడల తర్వాత ఖమేనీ తొలి స్పందన**



టెహరాన్, జూన్ 23: ఇరాన్‌లోని అణు పరిశోధనా కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులపై ఇరాన్ సుప్రీం నాయకుడు అయాతొల్లా అలీ ఖమేనీ సోమవారం స్పందించారు. ఇజ్రాయెల్‌కి తాము విధించిన శిక్ష కొనసాగుతుందని ఆయన ప్రకటించారు. 'ఇజ్రాయెల్ పెద్ద తప్పు చేసింది. పెద్ద నేరానికి పాల్పడింది. దాన్ని శిక్షించాల్సిందే.. శిక్ష కొనసాగుతోంది' అని ఖమేనీ తెలిపారు. అమెరికా వైమానిక దాడులుగా కనిపిస్తున్న ఫొటోలను కూడా ఆయన తన సోషల్ మీడియా అకౌంట్‌లో షేర్ చేశారు. ఆ ఫొటో మధ్యన ఓ పుర్రె బొమ్మ ఉంది. దాని నుదుటిపైన స్లార్ ఆఫ్ డేవిడ్ అని రాసి ఉంది. ఇది యూదులకు సంబంధించిన చిహ్నం. అమెరికా వైమానిక దాడులు చేసిన కొన్ని గంటల తర్వాత అత్యంత శక్తివంతమైన భాంబును తీసుకువెళ్లే సామర్థ్యం ఉన్న భారీ క్షిపణిని ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రయోగించిన కొన్ని గంటల్లోనే ఖమేనీ ఈ ప్రకటన చేశారు.

**ఈ యుద్ధానికి ముగింపు మేమే పలుకుతాం**

అమెరికాపై ప్రతీకార చర్యలు ఉంటాయని ఇరాన్ సైన్యం సోమవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు తీవ్ర హెచ్చరికలు జారీచేసింది. 'గ్యాంబ్లర్ ట్రంప్.. మీరు యుద్ధాన్ని ప్రారంభించవచ్చు కాని దాన్ని ముగించేది మాత్రం మేమే' అని ఇరాన్ సైనిక సెంట్రల్ కమాండ్ అధికార ప్రతినిధి ఇబ్రహీం జోల్ఫాఘరి హెచ్చరించారు.

**ఖమేనీకి 'రహస్య' విభాగం భద్రత!**

ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ కి ఎవరికీ తెలియని అత్యంత రహస్య భద్రతా విభాగంతో ఖమేనీకి భద్రత కలిస్తున్నట్టు సమాచారం.

## పాక్ విమానాలకు గగనతల నిషేధం పొడిగింపు

న్యూఢిల్లీ: పాకిస్థాన్ ఎయిర్‌లైన్స్ విమానాలకు మన గగనతల నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం మరో నెల పాటు పొడిగించింది. జూలై 24 వరకు నిషేధం కొనసాగుతుందని తెలిపింది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాక్ విమానాలకు గగనతల నిషేధాన్ని విధిస్తూ ఏప్రిల్ 30న కేంద్రం నిర్ణయించిన విషయం తెలిసిందే. అనంతరం దీన్ని పొడిగిస్తూ వస్తున్నది. మరో వైపు, పాకిస్థాన్ కూడా భారత విమానాలకు తమ గగగతల నిషేధాన్ని పొడిగించింది. జూలై 24 వరకు నిషేధం కొనసాగుతుందని తెలిపింది. పాకిస్థాన్‌తో సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడంతో పాక్ ఏప్రిల్ 24న గగనతల నిషేధాన్ని విధించింది